
సాక్షి
పల్నాడు
సోమవారం, 23, సెప్టెంబర్, 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29.928 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 45.61 టీఎంసీలు నిల్వ ఉంది.



7713 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 7713 క్యూసెక్కులు విడుదల చేశారు.



సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధి కిటకిట

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. సుదూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి అండర్-19 క్రీడా జట్ల ఎంపికలు




సత్తెనపల్లి: జిల్లాలోని జూనియర్ కళాశాలల విద్యార్థులకు గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు ఆదివారం తెలిపారు. ఈ నెల 24న అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో అండర్-19 బాల బాలికల రెజ్లింగ్ క్రీడా ఎంపికలు, గుంటూరు సమీపంలోని గోరంట్లలో గల నెక్స్‌ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మోడ్రన్ పెంటాథ్లాన్ క్రీడా ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ నెల 28న బాపట్లలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో త్రోబాల్ క్రీడా ఎంపికలు, చిలకలూరిపేట ఏఎంజీ కళాశాలలో బాస్కెట్‌బాల్, బాక్సింగ్ క్రీడా ఎంపికలు జరుగుతాయన్నారు. ఆయా క్రీడా ఎంపికలో పాల్గొనే విద్యార్థులు 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారై ఉండాలని, కళాశాల ప్రిన్సిపాల్ సంతకం చేసిన మార్కుల జిరాక్స్ కాపీని తప్పనిసరిగా క్రీడా ఎంపికలకు తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు.

కొండవీడుకు పర్యాటకుల అనుమతి



నాదెండ్ల: యడ్లపాడు మండలంలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కొండవీడుకు పర్యాటకులను ఆదివారం నుంచి అనుమతించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అధికారులు పర్యాటకుల రాకపోకలు నిలిపివేశారు. అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఘాట్‌రోడ్డుపై పడిన కొండరాళ్లను తొలగించి రహదారికి మరమ్మతులు చేశారు. ఆదివారం ఉదయం తనిఖీల అనంతరం రాకపోకలకు అనుమతించారు. రెండు వారాల నుంచి రాకపోకలు నిలిపివేయడంతో ఆదివారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. కొండపై ఏర్పాటు చేసిన నగరవనంలో పర్యాటకుల సందడి నెలకొంది.

బంగారు తాపడం పనులకు రూ. 1.01 లక్షల విరాళం




ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గుంటూరుకు చెందిన భక్తులు ఆదివారం విరాళాన్ని అందజేశారు. గుంటూరు సంగడిగుంటకు చెందిన పీరం శ్రీనివాసరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈవో కె.ఎస్.రామరావును కలిసి బంగారు తాపడం పనులకు రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

జెడ్పీ సీఈఓగా జ్యోతిబసు నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జెడ్పీ సీఈఓగా వి.జ్యోతిబసు నియమితులయ్యారు. అదే విధంగా డిప్యూటీ సీఈఓ బాధ్యతలు నిర్వర్తిస్తున్న జె.మోహనరావు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా డ్వామా ఏపీడీగా పని చేస్తున్న సీహెచ్ కృష్ణను నియమిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 589.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,350, ఎడమకాలువకు 2,818, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,623, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 58,024 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



వరినాట్లు వేస్తున్న వలస కూలీలు

నాటు..నాటు..నాటు.. వరి నాటు

రొంపిచర్ల మండలంలో ముమ్మరంగా వరి నాట్లు సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షం, సాగునీరు ఒకేసారి రావడం, వరినారు కూడా ఏతకు వచ్చి సిద్ధంగా ఉండటంతో మాగాణి సాగు వేగవంతం అయింది. వరినాట్లు వేసేందుకు రాష్ట్రంలోని ఇతర జిల్లాలతోపాటు ఒడిశా, బిహార్, బెంగాల్ రాష్ట్రాల నుంచి కూడా కూలీలు రావడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పొలాల్లో రెండు మూడు భాషలు, ఆయా ప్రాంతాల యాసలు మాట్లాడే జనం, వారి పాటలతో సందడి నెలకొంది.

– రొంపిచర్ల

ప్రకృతికి ప్రణామం

ప్రకృతి సేద్యం ఫలిస్తోంది

- జిల్లావ్యాప్తంగా విస్తరిస్తున్న సాగు
- సేద్యానికి ముందుకొస్తున్న యువ, మహిళా రైతులు
- 42 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 39,113 మంది రైతులు
- తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకర పంటలంటున్న రైతులు
- భూసార పరిరక్షణకు ప్రకృతి సేద్యం వైపు మొగ్గాలంటున్న వ్యవసాయాధికారులు



బెల్లంకొండ మండలంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీపీఎం, సిబ్బంది

బెల్లంకొండ: రసాయన ఎరువులు, పురుగు మందులను పక్కన పెట్టి కషాయాలు, సేంద్రియ సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందడంతో పాటుగా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించేందుకు ముందుకు వస్తున్నారు. నాణ్యమైన, బలవర్ధకమైన పంటలు పండిస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలతో తాము సాధించిన విజయాలను నలుగురికి పంచుతూ... ఆ నలుగురు మరో నలభై మందికి...ఇలా జిల్లావ్యాప్తంగా నేడు వేల సంఖ్యలో రైతులు ప్రకృతి వ్యవసాయ సాగు వైపు పయనిస్తున్నారు.

రసాయనాల నుంచి కషాయాల వైపు..

మితిమీరిన రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల నానాటికి అనర్థాలు అధికమవుతున్నాయి. మట్టిలో సత్తువ తగ్గి, సాగుకు మేలు చేసే సూక్ష్మ జీవులు అంతరించిపోతున్నాయి. ఖర్చు పెరుగుతూ, గిట్టుబాటు దక్కక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తుల అందించడమే కాక.. ఇటు అధిక ఆదాయం పొందేలా.. ప్రకృతి సాగుదిశగా జిల్లా అధికార యంత్రాంగం కొన్నేళ్లుగా రైతులను మళ్లిస్తోంది.

పాత రోజుల్లో వలే..

ఏపీ కమ్యూనిటీ మేనేజ్మెంట్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పూర్వ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. పంటలకు రసాయన ఎరువుల స్థానంలో జీవామృతం, వేప గింజల కషాయం, బ్రహ్మాస్త్రం వంటి రకరకాల కషాయాలు పంటలపై పిచికారీ చేసి నాణ్యమైన అధిక దిగుబడులు సాధిస్తూ వ్యవసాయంలో బంగారు బాటలు వేసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కూడా వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. వినియోగదారులే స్వయంగా పంటలు పండించే చోటుకు వెళ్లి మరీ ఉత్పత్తులను కొనుగోలు చేసుకుంటున్నారు.

విత్తు నుంచి పంటవరకు..

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అధికారులు, సిబ్బంది అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నారు. విత్తు వేసే దగ్గరనుంచి పంట చేతికి అందేవరకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ద్రవ, ఘనజీవామృతాలు, చీడపీడల నివారణకు కషాయాల తయారీ వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యక్షంగా చేసి చూపించడంతో పాటు వారితో తయారు చేయిస్తున్నారు.

ఎనీ టైం మనీ వచ్చేలా ప్రదర్శన క్షేత్రాలు..

మొత్తం 27 రకాల పంటలు, కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి, తీగజాతి, నూనెజాతి, పూలరకాలు, వివిధ రకాల పంటలను ఒకే పొలంలో వేసి నిరంతరంగా 365 రోజులు కూడా ఆదాయాన్ని ఇచ్చే విధానాన్ని ఏటీఎం మోడల్‌గా పరిచయం చేశారు. ఈ విధంగా పలు పంటల వేయడం వలన జీవవైవిధ్యం బాగా పెరిగి, అధిక దిగుబడి వస్తుంది. 20 సెంట్ల భూమి ఉన్న ప్రతి రైతుకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు వంటివి అందిస్తూ... ఏటీఎం మోడల్ నిరంతర ఆదాయం వచ్చేలా జిల్లాలో 28 ప్రదర్శన క్షేత్రాల వరకూ రైతులు సాగు చేస్తున్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం...

ప్రధాన పంట వరితో పాటుగా అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా గట్ల పైన చిక్కుడు, బీర, కాకర, మునగ, అరటి, బెండ తదితర కూరగాయలు, కంది, బంతి వంటి వాటిని వేయడానికి ప్రోత్సహిస్తున్నారు. కేవలం అంతర పంటల వల్లే రైతులకు గట్ల పరిమాణం బట్టి ఎకరాకు రూ.600 నుంచి రూ.1000 వరకు లాభం వస్తుంది. జిల్లాలో రైతులు 186 మంది వరకూ ఏ-గ్రేడ్ మోడల్స్‌లలో అంతర పంటల సేద్యం చేస్తున్నారు.

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం..



ప్రస్తుతం రసాయనాల ద్వారా సాగు చేస్తున్న పంటల్లో మనిషికి కావాల్సిన రోజువారీ పోషకాలు తగ్గిపోయాయి. పురుగు మందులు, ఎరువులు రేట్లు బాగా పెరగడంతో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటను పండించుకోవచ్చు. నిరంతరం ఆదాయం వచ్చే విధంగా ఏటీఎం మోడల్స్ వేసుకోవాలి. ప్రతి రైతు సేవా కేంద్ర పరిధిలో కనీసం ఒక ఎకరా భూమిలో ప్రకృతి వ్యవసాయం సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. క్రమంగా సాగు విస్తీర్ణం పెంచుకుంటూ అధిక శాతం ఈ విధానంలో సాగు చేసే విధంగా అవగాహన కల్పిస్తున్నాం.

– అమలకుమారి, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి, పల్నాడు

పల్నాడు జిల్లావ్యాప్తంగా...



బెల్లంకొండ మండలం నందిరాజుపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో రైతు అనంతలక్ష్మి పండిస్తున్న వరిపైరు

జిల్లాలో మొత్తం 39,113 మంది రైతులు 42,312 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం పద్ధతులు అవలంబిస్తున్నారు. వీరిలో పత్తి పంటలో 15,452 మంది రైతులు 17,630 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారు. వరి పంటలో 10,774 మంది రైతులు 11,704 ఎకరాల విస్తీర్ణంలో, మిరప పంటలో 12,887 మంది రైతులు 12,976 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. జిల్లాలో వ్యాప్తంగా ఎటువంటి రసాయనాలు వాడకుండా పూర్తి స్థాయిలో 13,265 మంది రైతులు 14,733 ఎకరాలు విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 28 నిరంతరం ఆదాయం ఇచ్చే ఏటీఎం మోడల్స్ ఉన్నాయి. అంతర పంటలు సాగు చేస్తున్న 186 ఏ-గ్రేడ్ మోడల్స్ ఉన్నాయి.

జిల్లా రిజిస్ట్రేషన్ సిబ్బందికి ముగిసిన కౌన్సెలింగ్

- గుంటూరు-1 ఎస్ఆర్వోగా షరీఫ్ బాబు
- సిఫారసు లేఖలు తెచ్చిన వారికి ప్రాధాన్యం దక్కినట్లు సమాచారం



పోస్టింగ్‌ల కోసం డీఐజీ కార్యాలయం ముందు వేచి చూస్తున్న సిబ్బంది

గుంటూరు వెస్ట్ : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారం స్థానిక జడ్పీ ఆవరణలోని డీఐజీ కార్యాలయంలో జరిగింది. ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ అధికారులు, సిబ్బంది కౌన్సెలింగ్‌కు వచ్చారు. కమిటీ చైర్మన్ గుంటూరు జిల్లా డీఐజీ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలు, నెల్లూరు డీఐజీలు పుష్పలత, కిరణ్ కుమార్‌లు బదిలీ ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 70 మంది సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం కలిగింది. దీనిలో భాగంగా గుంటూరు జాయింట్-1 ఎస్ఆర్వోగా మంగళగిరిలో పనిచేస్తున్న షరీఫ్ బాబు, జాయింట్-2గా నరసరావుపేటలో పనిచేస్తున్న వెంకటరావును బదిలీ చేశారు. కొరిటిపాడు ఎస్ఆర్వోగా పెదకూరపాడులో పనిచేస్తున్న వెంకటేశ్వరరావును, క్రోసూరులో పని చేస్తున్న భాస్కర్‌ను పెదకాకానికి, ప్రత్తిపాడుకు పి.శ్రీనివాసరావును, తాడికొండకు రమాదేవి, బాపట్లకు జాన్‌మోహన్ కుమార్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నల్లపాడు ఎస్ఆర్వోగా పనిచేస్తున్న గోపాల్‌ను అక్కడే ఉంచారు. దీంతోపాటు సుమారు 400 మంది సిబ్బందిని కౌన్సెలింగ్ ద్వారా వివిధ స్థానాలకు బదిలీ చేశారు. ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్న వారికి అధిక ప్రాధాన్యం దక్కినట్లు సమాచారం.

ఆర్థిక లావాదేవీలే ఏసుబాబు హత్యకు కారణం



నిందితుడు చంద్రశేఖర్ అరెస్టు చూపుతున్న డీఎస్పీ రామాంజనేయులు

- డీఎస్పీ రామాంజనేయులు
- హత్య కేసులో నిందితుడి అరెస్టు

బాపట్ల: సూర్యలంక సముద్ర తీర ప్రాంతం వద్ద జరిగిన హత్య కేసులో నిందితుడిని బాపట్ల రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామాంజనేయులు వివరాలు వెల్లడించారు. కృష్ణాజిల్లా పెద్దప్రోలు చెందిన ఏసుబాబు కొన్ని సంవత్సరాల నుంచి బాపట్లలో నివసిస్తూ, పరిసర ప్రాంతాల్లో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. బాపట్ల మండలం సూర్యలంక రహదారిలోని ఆదర్శనగర్‌కు చెందిన కొక్కిలగడ్డ చంద్రశేఖర్‌ను నెలకు రూ. పది వేలు ఇచ్చి అసిస్టెంట్‌గా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో నిందితుడు కొంతమందికి అప్పుకు డబ్బులు ఇప్పించాడు. సదరు వ్యక్తులు తిరిగి చెల్లించకపోవడంతో మృతుడు ఏసుబాబు (40) చంద్రశేఖర్‌పై ఒత్తిడి తెచ్చాడు. దీంతో ఏసుబాబును ఎలాయినా హత్య చేయాలని నిర్ణయించుకున్న చంద్రశేఖర్ పథకం ప్రకారం డబ్బులు ఇస్తానని అతడ్ని పిలిపించాడు. సూర్యలంక రహదారిలోని చప్టా వద్ద కోడికత్తితో మెడ కుడి వైపు పొడవడంతో ఏసుబాబు ప్రాణాలు కాపాడుకోవడానికి ద్విచక్ర వాహనంపై సూర్యలంక వెళ్లి షాపుల వద్ద పడిపోయాడు. స్నేహితుడైన గోవర్ధన్‌కు చంద్రశేఖర్ అలియాస్ (చిన్ను) తనను కోడి కత్తితో పొడిచాడని చెప్పి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ సీఐ గంగాధర్ అన్ని కోణాలలో కేసు విచారణ చేపట్టి నిందితుడైన కొక్కిలగడ్డ చంద్రశేఖర్‌ను సూర్యలంక రహదారిలోని పందెం కోడి రెస్టారెంట్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. విచారణలో నిందితుడు ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఏర్పడిన వివాదంలో తానే కోడికత్తితో పొడిచి హత్య చేశానని ఒప్పుకున్నాడని వివరించారు. కేసులో కీలకంగా వ్యవహరించి నిందితుడిని అరెస్టు చేసిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

మా కమీషన్లు తిరిగిచ్చేయండి!

బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్‌ను నిలదీసిన కాంట్రాక్టర్లు

- సుమారు రూ.3.80కోట్ల బిల్లులకు రూ.20లక్షల కమీషన్ ఇచ్చామంటున్న మున్సిపల్ కాంట్రాక్టర్లు
- టీడీపీ నేతల మాటవిని పంపిన బిల్లులు వెనక్కి తెప్పించిన కమిషనర్
- బిల్లులు చెల్లించకుండానే బదిలీపై వెళ్తున్న వైనం
- కమిషనర్ నివాసం ఎదుట కాంట్రాక్టర్ల ఆందోళన

నరసరావుపేట: 'మా దగ్గర తీసుకున్న కమీషన్ డబ్బులు తిరిగి మాకు ఇచ్చేసేయ్' అంటూ బదిలీపై వెళుతున్న కమిషనర్ గృహం ముందు మున్సిపల్ కాంట్రాక్టర్లు కొందరు ఆందోళనకు దిగిన సంఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సయ్యద్‌ఖాజా, డి.నరసింహారెడ్డి, డి.వేమారెడ్డి, బి.చంద్రశేఖర్, కె.వెంకటేశ్వర్లు, డి.రమణారెడ్డి, ఎ.యల్లారెడ్డి, నాగార్జునరెడ్డిలతో పాటు సుమారుగా పదహారుమంది మున్సిపల్ కాంట్రాక్టర్లుగా పలు అభివృద్ధి పనులు చేశారు. వారికి రూ.3.80కోట్లు బిల్లులు రావాల్సివుంది. ఎన్నికలకు ముందు వీరికి చెల్లించాల్సిన బిల్లులు కమిషనర్ ప్రభుత్వ ఖజానా అయిన ఎస్ఎంఎఫ్ఎస్‌కు పంపారు. ఎన్నికల కోడ్ రావటంతో ఆ బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. బిల్లులు చెల్లించేందుకు తమ వద్ద నుంచి రెండు నుంచి ఐదు శాతం వరకు ప్రస్తుతం బదిలీపై వెళుతున్న కమిషనర్ తీసుకున్నాడని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.



కమిషనర్ నివాసం ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

మిగతావారి వద్ద వసూలు చేసుకుని నా వద్దకు రండి..!

బదిలీపై వెళుతున్న కమిషనర్ నివాసం ఉండే నవోదయనగర్ డాలర్ బజారులోని ఆయన అపార్టుమెంట్‌కు వెళ్లిన కాంట్రాక్టర్లు తాము చెల్లించిన కమీషన్ డబ్బులు రూ.20లక్షలు తిరిగి ఇవ్వాలని కోరారు. అయితే దీనికి ఆయన ఎంఈ, డీఈ, ఏఈలు, అకౌంటెంట్ల వద్ద నుంచి వసూలు చేసుకొని చివరగా తన వద్దకు రావాలని చెబుతున్నాడని కాంట్రాక్టర్లు చెప్పారు. తమ వద్ద నుంచి కమిషనరే స్వయంగా డబ్బులు తీసుకున్నాడని, ఇప్పుడు ఇతరుల మీద చెబుతున్నాడని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏంటో అర్థం కావట్లేదని, వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి పట్టణ ప్రజలకోసం అభివృద్ధి పనులు చేసిన తమకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు.

టీడీపీ స్థానిక ముఖ్య నేత సూచనతో బిల్లులు వెనక్కి..

అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీ స్థానిక ముఖ్యనాయకుడు కమిషనర్‌చే ప్రభుత్వానికి పంపిన బిల్లులు వెనక్కి తెప్పించారన్నారు. బిల్లులు పంపడం కమిషనర్ వలనే సాధ్యమవుతుందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఆయన్ను ప్రశ్నిస్తే మళ్లీ పంపిస్తానని చెప్పారన్నారు. బిల్లులు తిరిగి పంపించకముందే కమిషనర్‌ను ప్రభుత్వం మాతృసంస్థకు బదిలీచేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన కమిషనర్‌గా మరో వ్యక్తిని నియమించింది.

క్లుప్తంగా

కారంపూడిలో 21.6 మి.మీ వర్షపాతం

రొంపిచర్ల: పల్నాడు జిల్లాలో శనివారం అత్యధికంగా కారంపూడి మండలంలో 21.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా గురజాలలో 0.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. దాచేపల్లిలో 2.2, అచ్చంపేటలో 2.8, పెదకూరపాడులో 3.2, సత్తెనపల్లిలో 1.0, నకరికల్లులో 2.0, నరసరావుపేట 7.6, ముప్పాళ్లలో 5.4, నాదెండ్లలో 19.4, యడ్లపాడులో 6.8 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. మిగిలిన 19 మండలాల్లో వర్షం కురవలేదు. జిల్లావ్యాప్తంగా 78.6 ఎం.ఎం. వర్షపాతం నమోదు కాగా సగటున 2.8 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. ఈ నెల 22వ తేదీ నాటికి జిల్లా సాధారణ వర్షపాతం 136.4మి.మీ. కాగా 199.7 మి.మీ. వర్షపాతం నమోదైంది.

నేడు ఆర్టీసీ పెట్టుబడుల సమావేశం

నరసరావుపేట: స్థానిక జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో సోమవారం సాయంత్రం 4గంటలకు పెట్టుబడుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్‌వీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సత్తెనపల్లి, దాచేపల్లి, పిడుగురాళ్లలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను 15ఏళ్ల అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్టాండ్‌లో మందుబాబు వీరంగం

అద్దంకి రూరల్: పూటుగా మద్యం తాగి ఓ వ్యక్తి ఆర్టీసీ బస్టాండ్‌లో వీరంగం సృష్టించాడు. ఆదివారం అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులను, ఆర్టీసీ ఉద్యోగులనుపై దురుసుగా ప్రవర్తిస్తూ, దుర్భాషలాడాడు. డిపో సిబ్బంది వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన దాసరి చినమస్తాన్ చీమకుర్తిలో నివాసం ఉంటున్నాడు. బంధువుల దిన కార్యక్రమాలకు వెళ్లడానికి ఒంగోలు నుంచి నరసరావుపేట వెళ్లే బస్సులో ఎక్కి అద్దంకిలో దిగాడు. ఈ క్రమంలో బస్సు లేటయిందని నరసరావుపేట బస్సు డ్రైవర్, కండక్టర్‌పైనా దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడాడు. ఇదేంటని ప్రయాణికులు వారించటంతో వారిపై కూడా చేయి చేసుకున్నాడు. తాను లారీ డ్రైవర్‌నని, మార్కాపురం, త్రిపురాంతకం, దొనకొండ ప్రాంతాల్లో పలు మర్డర్ కేసులు ఉన్నాయని, తన జోలికి వస్తే ఎమైనా చేస్తానని బెదిరించసాగాడు. ఈ క్రమంలో డిపో సెక్యూరిటీ అక్కడకు చేరకుని పట్టుకోవడానికి ప్రయత్నించగా రోడ్డు మీదకు పరారయ్యాడు. అయినా వదలకుండా వెంట బైకుమీద వెళ్లి పట్టుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

పింఛన్లు సరళ పద్ధతిలో ఇవ్వాలని వినతి

కొరిటిపాడు(గుంటూరు): ఏటా లైవ్ సర్టిఫికెట్ పద్ధతి కాకుండా డిజిటలైజేషన్ ద్వారా సరళ విధానంలో తమకు పెన్షన్లు అందించాలని పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు యు.వెంకట్రావు కోరారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జీటీ రోడ్‌లోని రైతు భవన్‌లో ఆదివారం జరిగింది. 75 ఏళ్లు వయస్సు నిండిన సభ్యులు నన్నపనేని అమర్నాథ్, స్థాపక్‌లను సత్కరించారు. వెంకట్రావు మాట్లాడుతూ.. బోర్డులో సుదీర్ఘకాలం పనిచేసి రైతులకు ఎన్నో సేవలను వీరిద్దరు అందించారని ప్రశంసించారు.

కేసుల ఛేదనలో సాంకేతికథ ఇదీ..!

- సాంకేతిక పరిజ్ఞానంతో క్లిష్టమైన కేసులకు పరిష్కారం
- హైవేపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఈనెల 15న ఇరువురి మృతి
- 24 గంటల్లో వాహనాన్ని గుర్తించి, నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

నాదెండ్ల: నేరం జరిగిన ప్రాంతంలో దొరికిన సాక్ష్యాధారాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో కేసులను గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదిస్తున్నారు. హత్య, రోడ్డు ప్రమాదాలు, చోరీలను అతి చాకచక్యంగా ఛేదిస్తూ నేరస్తులను కటకటాల వెనక్కునెడుతున్నారు. అర్ధరాత్రి జాతీయ రహదారిపై ఓ కారును గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇరువురు మృత్యువాత పడ్డారు. 24 గంటల వ్యవధిలోనే ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కేసులు ఛేదించిన సీఐ బత్తిన సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్‌ఐ బాలకృష్ణ, సిబ్బందిని పోలీసులు రివార్డులతో సత్కరించారు.

అసలేం జరిగిందంటే..

ఈ నెల 15వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో నిడమర్రు గ్రామానికి చెందిన వడల కృష్ణ, రవికిషోర్‌లు కాకినాడ నుంచి రొయ్యల శ్యాంపిల్స్ తీసుకుని ఏపీ39వీఎం7126 నంబరు గల కారులో నెల్లూరుకు వెళ్తున్నారు. తిమ్మాపురం వద్ద కారు టైరు పంక్చర్ కావటంతో రోడ్డు పక్కన నిలిపి మరమ్మతులు చేసుకుంటున్నారు. ఈ సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఒకరు సంఘటనా స్థలంలోనే మరణించగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


ప్రమాదంలో ధ్వంసమైన కారు (ఫైల్)

24 గంటల్లోనే ఛేదన ఇలా..

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇరువురు మృతి చెందిన కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టారు.

- సంఘటనా స్థలంలో ప్రమాదానికి కారణమైన వాహనం తాలూకు ధ్వంసమైన భాగాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.
- సీన్ ఆఫ్ అఫెన్స్ ప్రకారం వాహనం వెళ్లిన విధానాన్ని అంచనా వేశారు.
- ప్రకాశం జిల్లా బొల్లాపల్లి వద్ద గల టోల్‌ప్లాజాలో సీసీ కెమేరాల ఫుటేజీని పరిశీలించారు.
- ప్రమాదం జరిగిన సమయం, ప్రాంతం, టోల్ ప్లాజా దూరం అంచనా వేసి అనుమానిత వాహనాల గుర్తింపులో భాగంగా నెంబరు ప్లేటు లేని లారీని గుర్తించారు. టోల్ చెల్లించిన ఫాస్ట్‌టాగ్ వివరాలు పరిశీలించగా, లారీ ఒంగోలు పట్టణానికి చెందినదిగా తెలుసుకున్నారు.
- లారీ యజమాని వి.సురేష్‌కుమార్‌గా గుర్తించి సాధారణ కస్టమర్లు బాడుగ కోసం సంప్రదించినట్లుగా యజమానికి ఫోన్ చేసి మాట్లాడారు. అయితే బాడుగకు రావటం కుదరదని, లారీ రిపేరులో ఉందని యజమాని ఫోన్‌లో సమాధానమిచ్చాడు.
- లారీని ఒంగోలులోని షోరూమ్‌లో రిపేరు చేయిస్తున్నట్లు చెప్పటంతో హుటాహుటిన అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.
- లారీని పరిశీలించగా, ముందు భాగం ధ్వంసమైనట్లు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో లారీ ముందు భాగంలో అలంకరణకు వినియోగించే కుచ్చు పడిఉండటం, స్వాధీనం చేసుకున్న లారీకి రెండో వైపు అదేకుచ్చు ఉండటంతో ఆధారాలు నమోదు చేసుకున్నారు.

సాంకేతికతే కీలకం...



జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకాలు సాగిస్తుంటాయి. గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న ఘటనలో ప్రమాదానికి కారణమైన వాహనాలను గుర్తించటం కష్టంగా మారుతుంది. అయితే సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో కేసుల ఛేదన సులభతరమవుతోంది. సాక్ష్యాలుగా సీసీ ఫుటేజీలు ఉపకరిస్తున్నాయి. ఈ నెల 15న జరిగిన ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించేందుకు సాంకేతికతే ఆధారమైంది. 24 గంటల్లోనే కేసును ఛేదించటంతో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు చేతుల మీదుగా చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, నేను రివార్డులు అందుకున్నాం.

– వి.బాలకృష్ణ, యడ్లపాడు ఎస్‌ఐ

స్కూల్‌గేమ్స్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి గుంటూరుజిల్లా స్కూల్‌గేమ్స్ బాల బాలికల జిల్లా జట్లు ఎంపిక పోటీల తేదీలు, నిర్వహించే ప్రదేశాల వివరాలను ఆదివారం పల్నాడుజిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ప్రకటించారు. ఆయా క్రీడాంశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–14, అండర్–17 బాలబాలికల జట్లు ఎంపిక చేస్తారని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆయా తేదీలలో ఉదయం 9గంటలకు హాజరై ధ్రువపత్రాలను సమర్పించాలని కోరారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తమ పాఠశాలలోని క్రీడాకారులను ప్రోత్సహించి ఎంపిక పోటీలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడ	వేదిక	తేదీ
సెపక్ తక్రా	జడ్పీ హైస్కూల్, నందిగామ, సత్తెనపల్లి నియోజకవర్గం	సెప్టెంబరు 26
బాల్ బాడ్మింటన్ (బాలికలు)	జడ్పీ హైస్కూల్, శావల్యాపురం	సెప్టెంబరు 26
బాస్కెట్‌బాల్ (బాలురు)	ఏఎంజీ హైస్కూల్, చిలకలూరిపేట	సెప్టెంబరు 28
బాక్సింగ్	ఏఎంజీ హైస్కూల్, చిలకలూరిపేట	సెప్టెంబరు 28
బాస్కెట్‌బాల్ (బాలికలు)	మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, నరసరావుపేట	సెప్టెంబరు 30
ఖోఖో	బ్రహ్మనాయుడు జడ్పీ హైస్కూల్, కారంపూడి	అక్టోబర్ 1

మందకొడిగా సెంట్రల్‌జోన్, నార్త్‌జోన్ మ్యాచ్


జీవీఎస్ సుమిత్, 72 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీల్లో భాగంగా సెంట్రల్‌జోన్, నార్త్‌జోన్ మ్యాచ్ మందకొడిగా సాగుతోంది. తొలిరోజు వర్షం కారణంగా కేవలం 3 ఓవర్లు మాత్రమే ఆడి 6 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆదివారం బ్యాటింగ్ ప్రారంభించిన సెంట్రల్‌జోన్ తన తొలి ఇన్నింగ్స్‌ను 188 పరుగుల వద్ద ముగించింది. జట్టులోని జీవీఎస్ సుమిత్ 62 బంతుల్లో 72 పరుగులతో రాణించగా, వీరమాచ 30 పరుగులు సాధించాడు. నార్త్‌జోన్ బౌలర్లు ఎం.రవికిరణ్ 3, బి.యశ్వంత్ 2, టి.అచ్యుత్‌హేమంత్ 2 వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన నార్త్‌జోన్ రెండవరోజు ఆట ముగిసే సమయానికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు నష్టపోయి 85 పరుగులు చేసింది. జట్టులోని ఏవీవీ విజయ్ 28, ఎం.రవికిరణ్ 13 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. సోమవారం మూడవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న సీఐ హైమారావు

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి బంధువుల ఆందోళన


మృతురాలు జ్యోతి (ఫైల్)

నరసరావుపేటటౌన్: మహిళ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతిరాలి బంధువులు ఆదివా రం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాల ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. శివసంజీవయ్య కాలనీకి చెందిన గూడూరి జ్యోతి(33) కడుపు నొప్పితో బాధపడుతూ ఈ నెల 3వ తేదీన సత్తెనపల్లి రోడ్డులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరింది. మూడు రోజుల తర్వాత ఆమెకు శస్త్రచికిత్స చేశారు. వారం రోజుల తర్వాత డిశ్చార్జి చేశారు. జ్యోతి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో శుక్రవారం రాత్రి తిరిగి వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె మృతికి డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్య మే కారణమంటూ బంధువులు వైద్యశాల ఎదుట సత్తెనపల్లి రోడ్డు ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో మార్గంలో రాకపోకలు స్తంభించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కొంత మంది వైద్యశాల లోపలికి బలవంతంగా ప్రవేశించి అక్కడ ఉన్న కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు, ఎస్‌ఐ అశోక్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులకు నచ్చచెప్పి ధర్నా విరమింప చేశారు. జరిగిన సంఘటనపై ఫిర్యాదు ఇస్తే న్యాయం జరిగేలా చూస్తామని సీఐ హామీ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేసినప్పటికీ తమ వద్ద అదనంగా డబ్బులు వసూలు చేశారని రోగి బంధువులు ఆరోపించారు.

పురుగుమందు తాగి కౌలురైతు బలవన్మరణం

గురజాల: మద్యంలో పురుగు మందు తాగి కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పులిపాడు గ్రామానికి చెందిన కన్నెబోయిన శివ గంగరాజు (30) ఏడు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని అందులో మూడు ఎకరాలు పత్తి, నాలుగు ఎకరాలు మిరప పంటను సాగుచేస్తున్నాడు. గత రెండు సంవత్సరాలుగా పొలంలో దిగుబడి రాకపోవడంతో అప్పులు బాగా పెరిగిపోయాయి. దీంతో సుమారుగా రూ.20 లక్షలకు పైగా అప్పులు కావడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీనికి తోడు భార్య కూడా అలిగి పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగి మృతిచెందాడు. మృతుడి బంధువులు చూసి గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పాము కాటుకు కూలీ మృతి

గురజాల: పాము కాటుకు వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురజాలలోని క్రిస్టియన్ పేటకు చెందిన సింగంపల్లి సోమయ్య (54) నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో కె.శ్రీనివాసరెడ్డి గేదెల ఫారంలో గడ్డి కోసేందుకు తన స్నేహితులతో కలిసి కూలి పనులకు వెళ్లాడు. గడ్డి కట్టలు కడుతున్న సమయంలో సోమయ్యను పాము కాటేసింది. సోమయ్య పాము కరిచిన విషయాన్ని గమనించకపోవడంతో విషం తలకెక్కడంతో తల దిమ్ముగా ఉందని స్నేహితులకు చెప్పాడు. వెంటనే ద్విచక్రవాహనంపై వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి పాము కాటుకు గురయ్యాడని ఆలస్యం కావడంతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు ..



బొల్లాపల్లి: విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కంద్రిక గ్రామంలో ఆదివారం జరిగింది. బండ్లమోటు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. కంద్రిక గ్రామానికి చెందిన మేఘావత్ బాబులు నాయక్ (66) ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి విద్యుత్ వైర్లు తగిలిస్తుండగా షాక్‌కు గురై మృతిచెందాడు. బాబులు నాయక్ తన సొంత పొలంలో మిరప సాగు చేశాడు. ఉదయాన్నే నీరు కట్టడానికి పొలానికి వెళ్లి కరెంటు వైర్లు పెడుతుండగా వీటిలో ఒక వైరు జారి పడటంతో చేతికి, ఛాతికి గాయాలై మృతిచెందాడు. కొంత సమయం తరువాత కుమారుడు అదే పొలానికి వెళ్లాడు. తండ్రి పడి ఉండటాన్ని గమనించి చూడ గా అప్పటికే మృతిచెందినట్లు గమనించారు. మృతునికి భార్య తులసీబాయి, ముగ్గురు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు. మృతుడి కుమారుడు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి ..

పిడుగురాళ్ల: రోడ్డుదాటుతున్న వ్యక్తిని బైకు ఢీకొనడంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన పట్టణంలోని ఆంధ్రాబ్యాంకు సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలాఉన్నాయి. పట్టణానికి చెందిన ఏపూరి సత్యనారాయణ(65) అలియాస్ సోడాల సత్యం ఆంధ్రాబ్యాంకు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా పిడుగురాళ్ల వైపు నుంచి బ్రాహ్మణపల్లి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో సత్యనారాయణ రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ ఎం.మోహన్ సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంద కృష్ణ మాదిగకు కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల వినతి


మంద కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న నర్సులు

గుంటూరు మెడికల్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను ఆదివారం గుంటూరులో కలిసి తమ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు సకాలంలో ఇస్తున్నారని, ఏపీలో 15 ఏళ్లుగా ఇలా ఇవ్వకపోవటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నెంబర్ 115ను వెనక్కి తీసుకునేలా చూడాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల యూనియన్ నేతలు ఆలూరి స్వరూపారాణి, శైలజ, మేరీ కుమారి తదితరులు ఉన్నారు. కాగా, గుంటూరు జీజీహెచ్‌లో చేస్తున్న నిరసన కార్యక్రమం ఆదివారానికి 18వ రోజుకు చేరుకుంది. నల్లబ్యాడ్జీలు ధరించి, విధులు బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట సిబ్బంది నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల యూనియన్ నేతలు పి.మనీష, స్వరూపారాణి, రేణుక, శైలజ, మేరీ కుమారి, బి.శివమ్మ, వి.విజయ్‌కుమార్, కోటేశ్వరి, సౌజన్య, హైమావతి, సంధ్య, అంజమ్మ, కరుణ, సురేష్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- హోటల్స్, లాడ్జీలు, రిసార్ట్స్‌లో పోలీసుల తనిఖీలు


రిసార్ట్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

బాపట్ల: జిల్లా పరిధిలోని రెస్టారెంట్లు, దాబాలు, హోటల్స్, లాడ్జీలు, రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యకలాపాలకు చోటు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. జిల్లాలో శనివారం రాత్రి పలు ప్రాంతాల్లో ఆయన సిబ్బందితో ఆకస్మికంగా తనిఖీలు చేయించారు. ఎస్పీ అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు, నేరస్థులను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయాలతో పాటు అనుమతి లేని ప్రదేశాలలో తాగుత ఇతరులకు ఇబ్బందికరంగా వ్యవహరించే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోటల్స్, లాడ్జీలు, రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా వాటి నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. బస చేసే వ్యక్తుల పూర్తి వివరాల్ని రిజిస్టర్‌లో సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. బస చేసిన వారి కదలికలపై అనుమానం తలెత్తినా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉన్నా సంబంధిత పోలీస్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

సహజ సాహితీ సంస్థ స్ఫూర్తి పురస్కారాల ప్రదానం

చీరాల అర్బన్: సాహితీ, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభావంతులను పురస్కారాలతో గౌరవించుకోవడం బాధ్యతని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ సహజ సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాభారతి కాకరపర్తి వెంకటేశ్వర్లు పేరిట ఏర్పాటు చేసిన వేదికపై పురస్కారాలు అందించారు. కార్యక్రమానికి కోడూరి ఏకాంబరేశ్వరబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా బండారుపల్లి హేమంత్‌కుమార్, పోలుదాసు రామకృష్ణ, అంగలకుర్తి నాగవీరభద్రాచారి, చందలూరి బాలవెంకటేశ్వరరావు హాజరయ్యారు. పలు రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన రయితలు, కళాకారులు బత్తుల బ్రహ్మారెడ్డి, నూనె అంకమ్మరావు, కోసూరి రత్నం, గాడేపల్లి దివాకర్‌దత్తు, డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, భాగి కృష్ణమూర్తి, ఆసోది అక్కిరెడ్డి, కొణతం వెంకటరమణారెడ్డి, వడలి రాధాకృష్ణకు సహజ సాహితీ స్ఫూర్తి పురస్కారాలు అందించారు. వెన్నెలగంటి సీతారామాంజనేయశర్మ, ఆవుల దయాకర్‌రెడ్డి, కొసనం నాగమాంబ, జూటూరి సీతారామశాస్త్రి, మంత్రి కృష్ణమోహన్, పవని భానుచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ


వరద బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

లక్ష్మీపురం: వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండు రోజులపాటు నిరంతర సేవలు అందించి, ముంపు నుంచి బాధితులను కాపాడిన కస్టమ్స్, జీఎస్టీ అధికారులు ఇప్పుడు అదే బాధితులకు అండగా నిలుస్తూ, సాయం చేసేందుకు ముందుకు వచ్చారని కేంద్ర కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం విజయవాడలోని పలు ముంపు ప్రాంతాల్లోని బాధితులకు కేంద్ర కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ ఆధ్వర్యంలో నాలుగు లారీల సరకులను అందజేశారు. ముందుగా జీఎస్టీ ప్రధాన కార్యాలయం వద్ద రిలీఫ్ కిట్లతో కూడిన నాలుగు వాహనాలకు కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ రూ.12 లక్షల విలువైన పద్నాలుగు వందల రిలీఫ్ కిట్‌లు విజయవాడలోని కండ్రిక, వైఎస్సార్ కాలనీ, వాంబే కాలనీ, రాజీవ్ నగర్ ప్రాంతాలలోని వరద బాధిత కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. బాధితులకు సాయం అందించేందుకు తమ ఉద్యోగులు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐ ఆర్ ఎస్ అధికారులు కాకర్ల ప్రశాంత్‌కుమార్, బి.లక్ష్మీనారాయణ, బి.రవికుమార్, ఎం.నాగరాజు, జి.సీతారామరాజు జీఎస్టీ సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, చిట్టే వేంకటేశ్వరరావు, శ్రీకాంత్, సురేష్, కాకర్ల, శాఖమూరి, ప్రశాంత్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

జాషువా పద్యాల్లో నవరసాలు


డాక్టర్ గరికపాటి గురజాడను సత్కరిస్తున్న దృశ్యం

నగరంపాలెం: సామాజిక అధికార కవి జాషువా అని కేంద్రీయ విశ్వవిద్యాలయం (అనంతపురం జిల్లా) తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ గరికపాటి గురజాడ అన్నారు. మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి వారోత్సవాల్లో భాగంగా మహాకవి జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జాషువా పద్యానికి పట్టాభిషేకం అంశంపై సభ జరిగింది. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ గరికపాటి గురజాడను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాషువా పద్యాల్లో నవరసాలు ఉంటాయని ప్రశంసించారు. జాషువా సున్నితమైన మనస్కుడని, అదే ఆ కవికి ఉన్న గొప్ప లక్షణమని అన్నారు. ప్రపంచంలోని ప్రతి వస్తువులో భగవంతుడిని చూశారని తెలిపారు. కన్నతల్లిని ప్రేమించిన వాడే సమాజాన్ని ప్రేమిస్తారని స్పష్టం చేశారు. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. గుర్రం జాషువా సమాజ కవి అని అన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఎంజేఎస్ఎస్ అధ్యక్షుడు పినపాటి మోహనరావు, ప్రముఖ న్యాయవాది గద్దం ఎలీషా, కవి, నాటక ప్రయోక్త డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, సాహితీ పరిశోధకులు పారా అశోక్, అత్తోట జోసెఫ్, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.